క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లి రూరల్ : తాడేపల్లి రూరల్ ప్రాంత పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ డీఈ అక్కల సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లేన్ల అత్యవసర మరమ్మతుల నిమిత్తం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తాడేపల్లి, కుంచనపల్లి సరిహద్దు ప్రాంతమైన వెంకటేశ్వర స్వామి దేవస్థానం రోడ్డు, అరవింద స్కూల్ రోడ్, డీ మార్ట్, డామినోస్, మైత్రి గ్రాండ్, కుంచనపల్లి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, విద్యుత్ వినియోగదారులకు సహకరించాలని పేర్కొన్నారు.
తాడికొండ: నేడు మోతడక సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 7 నుంచి 11:30 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని విద్యుత్ శాఖ ఏఈఈ రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మోతడక, నిడుముక్కల, లచ్చన్నగుడిపూడి, రావెల, పాములపాడు, బేజాత్పురం గ్రామాలకు సరఫరా నిలిపివేయబడుతుందని పేర్కొన్నారు.

బహిరంగంగా మద్యం తాగితే జరిమానా

మంగళగిరి: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే రూ.1000లు జరిమానా విధించడంతో పాటు చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని రూరల్ ఎస్ఐ క్రాంతి కుమార్ శుక్రవారం కొ ప్రకటనలో తెలిపారు. ఎవరైనా బహిరంగంగా మద్యం సేవిస్తే తమకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు.

శివాలయంలో అన్నదానం



మంగళగిరి: పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానం(శివాలయం)లో శుక్రవారం అన్నదానం నిర్వహించారు. ప్రతి అమవాస్యకు కాశీ అన్నపూర్ణ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు. టీడీపీ నాయకులు పోతినేని శ్రీనివాసరావు, మాజీ జెడ్పీటీసీ ఆకుల జయసత్య, ఆకుల ఉమామహేశ్వరరావు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ట్రస్ట్ ప్రతినిధులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఓ జేవీ నారాయణ, ట్రస్ట్ ప్రతినిధులు కర్నాటి శివసత్యనారాయణ, జూటు ఏడుకొండలు, పందేటి సాంబ శివరావు, దామర్ల వీరాస్వామి, కగ్గా శ్రీను, దామర్ల నాగరాజు, రాజారావు, అచ్చయ్య పాల్గొన్నారు.

నేడు జగ్జీవన్ రామ్ జయంతి

మంగళగిరి: బారతదేశ మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో నిర్వహించే ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు.

11న మండల సర్వసభ్య సమావేశం

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఈ నెల 11న మధ్యాహ్నం 3గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో విమాదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీపీ షేక్. షహేలా నర్గీస్ అధ్యక్షత వహిస్తారని, వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహిస్తారని పేర్కొన్నారు.

సీజన్ వ్యాధులపై అవగాహన

ఎర్రబాలెం(క్రోసూరు): మండలంలోని ఎర్రబాలెం గ్రామ సచివాలయం-3 పరిధిలో ఏఎన్ఎం స్వప్న, ఎంఎల్‌పీహెచ్ రజనీ, ఆశ వర్కర్ల ఆధ్వర్యంలో డెంగీ వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. అదేవిధంగా అతిసార విషయంలో ప్రజల ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలన్న విషయాలపై స్టాప్ డయేరియా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌పీహెచ్ మాట్లాడుతూ అతిసార బారిన పడకుండా పరిసరాలు పరిశుభ్రత, తాగునీటిపై అవగాహన కల్పించారు. ఐదేళ్ల లోపు చిన్నారులకు, పెద్దలకు వాంతులు, విరోచనాలు అయితే ఓఆర్ఎస్ ద్రావణాన్ని అందించాలన్నారు. ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలని చెప్పారు. వేడి ఆహార పదార్థాలను తీసుకోవాలని సూచించారు. అతిసార సమస్యలుంటే వెంటనే పీహెచ్‌సీలో తెలిజేయాలని కోరారు.

క్యాన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలి

గుంటూరు ఎడ్యుకేషన్: క్యాన్సర్ బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని ఓమేగా హాస్పిటల్స్ కన్సల్టెంట్ మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ మహతి పేర్కొన్నారు. గుజ్జన గుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లో అధ్యాపకులకు క్యాన్సర్‌పై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. తొలిదశలో గుర్తించడం ద్వారా క్యాన్సర్ ముప్పు నుంచి రక్షణ పొందవచ్చునని డాక్టర్ మహతి తెలిపారు. ప్రిన్సిపల్ ఎస్.ప్రభాకరరావు పాల్గొన్నారు.

నకిలీ పురుగు మందులతో జాగ్రత్త

- కొనుగోలు సమయంలో అవగాహన అవసరం
- మందులకు రసీదు తప్పనిసరి
- అన్నదాతలకు అధికారుల సూచన



దుకాణంలో పురుగు మందులు

తాడేపల్లి రూరల్: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. ఈ తరుణంలో పంట పొలాలకు ఎరువులు అధికంగా వినియోగిస్తారు రైతులు. దీంతో మార్కెట్‌లోకి నకిలీ ఎరువులు, పురుగు మందులు పెద్ద ఎత్తున వచ్చే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఖరీఫ్, రబీ సీజన్లలో ఎరువులు కొనుగోలు చేసే విషయంలో ఒకటికి రెండు సార్లు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. అధికారుల సూచనల మేరకు ఎరువులు, పురుగు మందులు తీసుకోవాలని, లేకుంటే నిలువునా మోసపోయే అవకాశం ఉందని అంటున్నారు.

దళారుల వద్ద మందులు కొనుగోలు చేయవద్దు

నిషేధిత పురుగు మందులు కొనుగోలు చేస్తే రైతులు నష్టపోతారని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. ఎరువుల వ్యాపారులు పంట దిగుబడి అధికంగా వస్తోందని నమ్మించి, అనుమతి లేని వివిధ కంపెనీల కల్తీ ఎరువులు, పురుగు మందులు రైతులకు అంటగట్టే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. అదేవిధంగా అనుమతి లేని దుకాణాలు, దళారుల వద్ద కొనుగోలు చేయవద్దని సూచిస్తున్నారు. వాటిని కొనుగోలు చేస్తే పంట దిగుబడి తగ్గడంతో పాటు భూసారం దెబ్బతింటుందని చెబుతున్నారు. మందుల లేబుళ్లను మొదట పరిశీలించి, అవి కంపెనీ ఎరువులా లేక స్థానికంగా తయారు చేసి విక్రయిస్తున్నారా? అన్న విషయాలను రైతులు తెసుకోవాలని, ఎరువులు, పురుగుల మందులు కొనుగోలు చేసిన తరువాత తప్పని సరిగా బిల్లులు తీసుకోవాలని సూచిస్తున్నారు.

నకిలీ ఎరువులని తెలిస్తే ఫిర్యాదు చేయండి

దుకాణాలు లైసెన్స్ లేకుండా విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేయాలి. మందుల లాట్ నంబరును బట్టి తయారు చేసిన తేదీని గుర్తించి, ఏ కంపెనీ, ఏ రకం వంటి విషయాలను చూడాలి. దుకాణ యజమాని డీలర్‌తో సంతకాలతో కూడిన బిల్లును తప్పక తీసుకోవాలి. ముఖ్యంగా విత్తనాలకు సంబంధించి సంచులపై సీలు తొలగించినట్లు గుర్తిస్తే వాటిని కొనుగోలు చేయకుండా నకిలీలపై సత్వరం రైతులు ఫిర్యాదు చేయాలి. అధికారుల పరిశీలనలో అది వాస్తవమని తేలితే సంబంధిత డీలర్‌పై కేసులు నమోదు చేసి, రైతులకు న్యాయం జరగడానికి అవకాశముందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

నకిలీ ఎరువులు విక్రయిస్తే లైసెన్స్ రద్దు



ఎరువుల దుకాణాల్లో నకిలీ ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తున్నట్లు తమ పరిశీలనలో గుర్తిస్తే దుకాణాల లైసెన్స్ రద్దు చేస్తాం. మందుల కొనుగోలు చేసిన రైతుకు డీలర్, దుకాణ యజమాని సంతకాలతో కూడిన బిల్లును అందజేయాలి. క్రిమి సంహారక మందులు కొనుగోలు చేసే సమయంలో డబ్బాపై ఉన్న వివరాలను పూర్తిగా పరిశీలించాలి. లేదా తెలిసిన వారికి చూపించి అది ఏ కంపెనీదో నిర్ధారించిన తర్వాతే కొనుగోలు చేయాలి. డబ్బాపై చూపించిన వివరాల ప్రకారమే మందు పిచికారీ చేయాలి.

– పి.శిరీష, వ్యవసాయ అధికారి, దుగ్గిరాల

మందిరం వివాదంపై కలెక్టర్ విచారణ

రాయపూడి గ్రామస్తుల అభిప్రాయాల సేకరణ



వివరాలు తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి

తాడికొండ: తుళ్ళూరు మండలం రాయపూడి గ్రామంలో ఉన్న హోసన్నా ప్రార్థన మందిరం నిర్మాణం విషయంలో ఉన్న అభ్యంతరాలపై నివేదిక సిద్ధం చేసేందుకు శుక్రవారం గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి తుళ్ళూరు ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ విషయంపై ఇప్పటికే కోర్టులో హోసన్నా మందిరం నిర్వాహకులకు అనుకూలంగా కింది కోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో రాయపూడి గ్రామానికి చెందిన 170 మంది వ్యక్తులు హైకోర్టులో పిటీషన్ వేశారు. ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. వీరి అభ్యంతరాలపై కలెక్టర్ విచారణ చేపట్టారు. పిటీషన్ వేసిన గ్రామస్తుల అభిప్రాయాలు సేకరించారు. 2006లో స్థల యజమాని మల్లెల విశ్వనాథరావు ప్రార్థన మందిరానికి తమకున్న ఐదెకరాల భూమిలో 25 సెంట్లు ఉచితంగా ఇచ్చారు. ఈ ప్రాంతం రాజధాని అయ్యాక రాయపూడి సీడ్ యాక్సిస్ రోడ్డుకు అడ్డుగా ఉన్నందున తొలగించాలని సిఫార్సు చేసిన అధికారులు నష్ట పరిహారం కింద 2018లో రూ.60 లక్షలు చెల్లించడంతో పాటు వేరే చోట మందిరం నిర్మాణం నిమిత్తం 25 సెంట్లు స్థలం కేటాయించారు. అయితే ఈ స్థలం, పరిహారం దాతలు తీసుకొని ఐదెకరాల పంట భూమిలో మరో 25 సెంట్లు ప్రార్థనా మందిరానికి ఇచ్చారంటూ పలువురు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. కాగా ఈ ఐదెకరాల భూమిని 1976లో విశ్వనాథరావు తాత మల్లెల వెంకటరాయుడు వేణుగోపాల స్వామి గుడికి రాసిచ్చారని, ఇందుకు సంబంధించిన వీలునామా కూడా ఉందని గ్రామస్తులు చెబుతున్నారు. దీనిని విశ్వనాథరావు, భార్య దీప్తి(దానమ్మ) అక్రమంగా స్వాధీనం చేసుకున్నారని పలువురు ఆరోపించారు. ఈ ప్రాంతంలో చర్చి నిర్మాణం చేయడానికి వీలు లేదంటూ స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో చర్చి మళ్లీ నిర్మిస్తే తమకు ఇబ్బందిగా ఉంటుందని, మైకులతో వారంలో నాలుగు రోజులు పాటు ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. ఈ సమావేశానికి హాజరయ్యేందుకు శివస్వామి విచ్చేయగా మత విభేదాలు తలెత్తే ప్రమాదం ఉందని, సమావేశం జరిగే ప్రాంతానికి ఆయనను అధికారులు అనుమతించలేదు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట ఆర్డీఓ శ్రీకర్ పలు విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పింఛను ఇప్పించరూ...




ఫిరంగిపురం: మండల కేంద్రానికి చెందిన కె.బాలస్వామి అనే వృద్ధుడు యాచనతో పొట్టపోసు కుంటున్నాడు. ఎన్నో ఏళ్లుగా పింఛన్ ఇప్పించాలని కోరుతూ కార్యాలయాల చుట్టూ తిరిగినా మంజూరు కాలేదు. కారణం అతడికి రేషన్ కార్డు లేకపోవడమే నంటూ అధికారులు చెబుతున్నారు. రేషన్ కార్డు తెచ్చుకుంటే..పింఛను మంజూరు చేస్తామంటూ చెబుతున్నారని బాలస్వామి ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. దయుంచి తనకు పింఛను మంజూరు చేయించాలని చాలామంది చుట్టూ తిరుగుతున్నాడు. ఇప్పటి కైన అధికారులు స్పందించి పింఛను మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఎస్టీయూ సభ్యత్వ నమోదు



ఫిరంగిపురం: మండల కేంద్రంలో శుక్రవారం ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు డి.పెదబాబులు హాజరై ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని చెప్పారు. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం విద్యా శాఖలో పెను మార్పులు తీసుకువస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. జీవో-117 రద్దు చేయాలని, విలీన విధానాన్ని వెనక్కి తీసుకోవాలని, పీఆర్సీ కమిటీ రిపోర్టు ఆలస్యమవుతున్నందున సత్వరం ఐఆర్ ప్రకటించాలని కోరారు. అనంతరం అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు సభ్యత్వ నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ మండల అధ్యక్షుడు పి.ప్రసాద్, ప్రధాన కార్యదర్శి పి.సుందరరావు, కార్యవర్గ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన బీజేపీ నాయకులు



తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండల పరిధిలోని కంఠంరాజు కొండూరు గ్రామంలోని శ్రీ మహంకాళి అమ్మవారి దేవస్థానం ఆవరణలో శుక్రవారం బీజేపీ నాయకులు మొక్కలు నాటారు. పార్టీ మండల అధ్యక్షుడు పసుపులేటి గణేష్ మాట్లాడుతూ అమ్మకు వందనం కార్యక్రమంలో భాగంగా అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలో జమ్మి, ఉసిరి మొక్కలను నాటామన్నారు. సీనియర్ నాయకులు కొంగర జోగేంద్ర ప్రసాద్ దంపతులు, రాజారావు, కిషోర్, సిద్ధు, పి.ప్రదీప్, చంద్ర, భాస్కరరావు, ఆలయ ఈఓ చినవెంకటరెడ్డి పాల్గొన్నారు.

బహుజనుల ఆత్మబంధువు పాశ్వాన్



రాంవిలాస్ పాశ్వాన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అరుణ్‌కుమార్, బాబూరావు

నెహ్రూనగర్: దళిత బహుజనుల ఆత్మ బంధువు రాం విలాస్ పాశ్వాన్ అని మాలమహానాడు జాతీయ అధ్యక్షులు గోళ్ల అరుణ్‌కుమార్ పేర్కొన్నారు. రాం విలాస్ పాశ్వాన్ జయంతిని పురస్కరించుకుని అంబేద్కర్ భవన్‌లో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పెద్ద దిక్కుగా వ్యవహరించిన రాంవిలాస్ పాశ్వాన్ ఆయన ఏ ప్రభుత్వంతో కలిసి పనిచేసిన అంతిమంగా అట్టడుగు వర్గాల జాతి ప్రయోజనాలకే తొలి ప్రాధాన్యం ఇచ్చే వారని గుర్తు చేశారు. ఎనిమిది సార్లు లోక్ సభ సభ్యునిగా, ఒకసారి రాజ్యసభ సభ్యునిగా ప్రధాని వీపీ సింగ్ మొదలుకుని ఆరుగురు ప్రధాన మంత్రుల క్యాబినెట్‌లో మంత్రిగా పనిచేసిన ఘనత రాంవిలాస్ పాశ్వాన్‌కే దక్కుతోందన్నారు. ఎస్సీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ సెక్రటరీ జనరల్ మేడిద బాబూరావు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కారంచేడు, చుండూరు ఘటనలతో చలించిన రాంవిలాస్ పాశ్వాన్ అప్పటికే రాజ్యాంగంలో పొందుపరిచిన పౌరహక్కుల రక్షణ చట్టం ఒక్కటే ఎస్సీ, ఎస్టీలకు సరిపోదని, అటువంటి ఘటనలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక చట్టం తేవాలనే ఉద్దేశంతో ఎస్సీ, ఎస్టీ, అత్యాచారాల నిరోధక చట్టాన్ని తీసుకురావడంతో కృతకృత్యులయ్యారన్నారు. మేడ్ రాష్ట్ర అధ్యక్షులు మురికిపూడి దేవపాల్ మాట్లాడుతూ దేశంలో వెనుకబడిన కులాల అభివృద్ధి సంక్షేమం కోసం, బీపీ మండల్ కమిషన్ అమలు కోసం విశేష కృషి చేశారన్నారు. ఆయన అడుగుజాడల్లో నేటి యువత నడవాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు బాలకృష్ణ, విల్సన్, వినయ్, రామకృష్ణ, రవికుమార్, సుమంత్, కెనడీ పాల్గొన్నారు.

వాహనాలపై కేసులు నమోదు



వాహనాలు తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారులు

నెహ్రూనగర్: నిబంధనలు పాటించకుండా తిరుగుతున్న ట్రాన్స్‌పోర్టు, నాన్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాలపై కేసులు నమోదు చేశామని రవాణా శాఖ జిల్లా ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా గురు, శుక్రవారాల్లో పలు ప్రాంతాల్లో మోటార్ వాహన తనిఖీ అధికారులు వాహనాలను తనిఖీ చేసి పదుల సంఖ్యలో కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన వారిపై 25, ఇన్సూరెన్స్ లేని వాటిపై 31, ఫిట్నెస్ లేని వాహనాలపై 10, పన్ను చెల్లించకుండా వాహనం నడిపిన వారిపై 4, అదనపు ప్రయాణికులను ఎక్కించుకుని తిరుగుతున్న వాహనాలపై 2, పర్మిట్ లేకుండా తిరుగుతున్న వాహనాలపై 2, ఇతర నిబంధనలు పాటించని వాటిపై 7 కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు.

టెలికం కంపెనీలు ధరలు పెంచడం అన్యాయం

లక్ష్మీపురం: కేంద్రంలో ప్రధాని మోదీ మూడోసారీ పీఠం మీద కూర్చున్న కొన్ని రోజుల్లోనే ప్రైవేటు కంపెనీలు మొబైల్ రీచార్జిల ధరలను భారీగా పెంచి ప్రజలపై రూ.2 0వేల కోట్ల భారాన్ని మోపడం దారుణమని అవగాహన సంస్థ సభ్యులు పేర్కొన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శుక్రవారం 'అడ్డూ అదుపు లేకుండా ప్రైవేటు టెలికంపెనీల విజృంభణ' అనే అంశంపై సమావేశం నిర్వహించారు. సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ జనం మొబైల్ అవసరాన్ని లాభాల మూటలుగా మార్చుకోడమే ప్రైవేటు టెలికం కంపెనీల అసలు ఉద్దేశమని విమర్శించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రిలయన్స్ జియో రూ.20,607 కోట్ల నికర లాభాన్ని ఆర్జించగా, ఎయిర్ టెల్ రూ.7,467 కోట్ల లాభాన్ని వెనుకేసుకుందన్నారు. ఈ కంపెనీల ధన దాహం తీరలేదని, దేశంలో మొబైల్ ఫోన్లు వాడుతున్న 1.20 కోట్ల మంది నుంచి తలో కొంత అదనంగా వేశారని ఆరోపించారు. ఎన్నికల బాండ్ల పేరుతో ఈ కంపెనీలు ప్రధాన పార్టీలకు కోట్లాది రూపాయలు ఇచ్చి తమను ఎవరూ ఏమి అనకుండా చేసుకున్నారని విమర్శించారు. న్యాయవాది ఎ. హరి మాట్లాడుతూ మాటికి పరస్పరం పోటీ దారులమంటూ ఫోజులిస్తూ చార్జీల వడ్డనలో మాత్రం కూడబలుక్కొని వ్యవహరించాయని ఈ సందర్భంగా దుయ్యబట్టారు.

ప్రభుత్వ పాఠశాలల సమస్యలను పరిష్కరించాలి

పాఠశాల విద్య డైరెక్టర్‌కు వినతిప్రతం అందజేత



పాఠశాల విద్యా డైరెక్టర్ పార్వతికి వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

తాడేపల్లిరూరల్ : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు భూషణం, కె.భాస్కర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మంగళగిరిలోని విద్యాభవన్‌లో పాఠశాల విద్యా డైరెక్టర్ పి.పార్వతిని కలసి, వినతి పత్రం అందజేశారు. అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాల్లో మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు 40 వేలు ఉన్నాయని, వీటిలో సుమారు 35.69 లక్షల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు. విద్యా సంవత్సరం ప్రారంభంలోనే విద్యా కానుక కిట్లు, పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు ఇంకా పూర్తిస్థాయిలో అందించలేదని అన్నారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేయాలని, 3, 4, 5 తరగతుల విలీన ప్రక్రియ ఆపాలని, దానికి సంబంధించిన జీఓ నెం.84, 85, 117లను రద్దు చేయాలని కోరుతున్నామన్నారు. ఈ జీవోల ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 5,400 పాఠశాలలు మూతబడ్డాయని, తక్షణమే ఈ జీఓను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు మహర్షి, సహాయ కార్యదర్శి కె.నాని పాల్గొన్నారు.

సీసీఆర్ కార్డులకు దరఖాస్తు చేసుకోవాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారిణి శ్రీరంజని

వడ్డమాను(తాడికొండ): కౌలు రైతు గుర్తింపు(సీసీఆర్సీ) కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని తుళ్ళూరు మండల వ్యవసాయాధికారిణి కె.శ్రీరంజని తెలిపారు. తుళ్ళూరు మండలం వడ్డమాను గ్రామంలో రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు కౌలు రైతు గుర్తింపు కార్డుల జారీపై సంయుక్తంగా అవగాహనా సదస్సు నిర్వహించారు. ఏఓ ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రసంగించారు. పొలం లేకుండా కౌలుకు పంట సాగు చేసే రైతులు, సొంత పొలం ఉన్నప్పటికీ కౌలుకు పొలం తీసుకొని సాగు చేసే రైతులు ఈ సీసీఆర్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దీని వల్ల పంట నమోదుతో పాటు రాయితీపై విత్తనాలు, ఎరువులు, పంట నష్టం వాటిల్లినపుడు ప్రమాద బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, పొందే అకాశం ఉందన్నారు. రైతులు పొలం పాసు పుస్తకం, ఆధార్, బ్యాంకు పాసు పుస్తకం, భూమి కలిగిన రైతు ఆధార్ జెరాక్స్‌లు, పాస్‌పోర్టు ఫోటోలను వీఆర్‌వోకి లేదా రైతు భరోసా కేంద్రంలో అందజేయాలని సూచించారు. ఈ సందర్భంగా వరి పండించే రైతులకు రాయితీ వరి విత్తనాలు అందజేశారు. పిన్నక సాంబశివరావు, వెంకటరెడ్డి, పారు బుజ్జి, కొమరాబత్తిని శేఖర్ పాల్గొన్నారు.

భూ అధీకృత చట్టం పునరుద్ధరణకు సంతకాల సేకరణ



సంతకాలు సేకరిస్తున్న సంఘ నాయకుడు రామకృష్ణ

మేడికొండూరు: భూ అధీకృత చట్టం -2011 పునరుద్ధరించాలని సంతకాల సేకరణ కార్యక్రమం శుక్రవారం మందపాడు, పొట్లపాడు గ్రామాల్లో జరిగింది. రైతు సంఘ మండల నాయకులు బొట్ల రామకృష్ణ మాట్లాడుతూ 2019 సీసీఆర్సీ కౌలు చట్టం రద్దు చేసి 2011లో భూ ఆధీకృత చట్టం పునరుద్ధరించాలంటూ డిమాండ్ చేశారు. కౌలు రైతులు ముఖ్యమంత్రికి వినతి పత్రం అందజేసేందుకు సంతకాలు సేకరించారు. కార్యక్రమంలో పలువురు కౌలు రైతులు పాల్గొన్నారు.

విత్తన దుకాణాల తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న డీటీ శ్రీనివాసరావు, ఏఓ నాగరాజు

మేడికొండూరు: మండల పరిధిలోని సిరిపురం గ్రామంలో విత్తన దుకాణాల్లో అధికారులు తనిఖీలు చేపట్టారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించినట్లు డెప్యూటీ తహసీల్దారు కుంభా శ్రీనివాసరావు తెలిపారు. అధిక ధరలకు విక్రయించకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విక్రయాలపై ఎలాంటి అవకతవకలు జరిగినా ఆయా షాపుల లైసెన్సు రద్దు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. తనిఖీల్లో మండల వ్యవసాయ శాఖ అధికారి మన్నవ నాగరాజు పాల్గొన్నారు.

డాక్టర్ రావూరి భరద్వాజ్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న వనమా నరేంద్రకుమార్, డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ తదితరులు

గుంటూరు మెడికల్: జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత కళాప్రపూర్ణ డాక్టర్ రావూరి భరద్వాజ్ జయంతి సందర్భంగా శుక్రవారం స్థానిక లాడ్జిసెంటర్‌లోని ఆయన విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్రకుమార్, గుంటూరు తూర్పు సమన్వయకర్త డాక్టర్ శనక్కాయల ఉమా శంకర్ హాజరయ్యారు. నివాళులర్పించిన వారిలో బీజేపీ నేత మాగంటి సుధాకర్ యాదవ్, విగ్రహ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు మేడూరి శివ రామబ్రహ్మం, ఉపాధ్యక్షుడు కొత్తూరి మోహన్‌రావు, కార్యదర్శి జంపని రాధాకృష్ణమూర్తి, కోశాధికారి బసవపాత్రుని మల్లికార్జునరావు, ఉప కార్యదర్శి అత్తారి వీరభద్రచార్యులు, రాష్ట్ర వైశ్య బ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు హనుమంతరావు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్చాలి



కార్యక్రమంలో ఎంఈఓ సుబ్బారావు హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు

చేబ్రోలు: బడి వయస్సు కలిగిన చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని మండల విద్యాశాఖాధికారి రాయల సుబ్బారావు అన్నారు. చేబ్రోలు మండలం శ్రీరంగపురం, తోట్లపాలెం గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో నేను బడికిపోతా కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన రహదారుల్లో ప్ల కార్డులు, ఫ్లెక్సీలు చేతపట్టుకొని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. బడి బయట ఉన్న పలువురు పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాలకు పంపటానికి అంగీకరింపజేశారు. ఈ సందర్భంగా రెండు గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో రాయల సుబ్బారావు మాట్లాడుతూ పాఠశాలల్లో పిల్లల నమోదు పెంచడానికి మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న వారికి ప్రోత్సాహకాలు, తగిన మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు వివరించారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడుల్లో విద్యాబోధన జరుగుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సర్పంచ్‌లు, గ్రామ పెద్దలు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా స్వామి కల్యాణం

నగరంపాలెం: స్థానిక బ్రాడిపేట 2/7వ అడ్డరోడ్‌లోని గౌరివిశ్వేశ్వరాలయంలోని స్వామి జన్మ నక్షత్రం సందర్భంగా శుక్రవారం స్వామికి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అలంకరణలు చేసి, ప్రత్యేక పూజలు జరిపారు. మల్లాది వెంకటరవి కుమార్, నాగలక్ష్మి, కొణతం శ్రీనివాసరావు, .ధనలక్ష్మి దంపతులతో అర్చక స్వామి విశ్వేశ్వరశర్మ కల్యాణం జరిపించారు. ఆలయ అర్చకులు జంధ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రి, పవన్‌కుమార్, మల్లిక్, చక్రపాణి కార్యక్రమాలను పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఆటోలపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: హిందూ కళాశాల సెంటర్‌లో ఈస్ట్, వెస్ట్ ట్రాఫిక్ పోలీసులు ఆటోలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. వెస్ట్ ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు, ఈస్ట్ ట్రాఫిక్ సీఐ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆటోలపై శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించామన్నారు. మొత్తం 20 ఆటోలపై కేసులు రాసి, రూ.1,30,750 అపరాధ రుసుం వసూలు చేశామని తెలిపారు. లెసెన్సు, యూనిఫాం, ఇన్సూరెన్సు లేని, డాక్యుమెంట్లు సరిగా లేని ఆటోలపై కేసులు రాసినట్లు వెల్లడించారు.